



సంపత్ వినాయగర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

న్యూ ఇయర్ సందడి

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులుతీరిన నేతలు, కార్యకర్తలు
- భారీగా స్వీట్లు, పూల బొకేల విక్రయాలు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

నూతన సంవత్సర వేడుకలను నగరవాసులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కొత్త సంవత్సరంలో మొదటి రోజున చాలామంది దైవదర్శనం చేసుకుంటుంటారు. దీంతో నగర పరిధిలోని అనేక దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా సింహాచలం దేవస్థానం, ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయక్, వన్‌టౌన్‌లోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఇక ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద సందడి ఎక్కువగా కనిపించింది. ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బారులు తీరారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారులకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూ ఇయర్ నేపథ్యంలో మార్కెట్‌కు జోష్ కనిపించింది. స్వీట్లు, ఫ్రూట్‌బాక్సులు, పూల బొకేల విక్రయాలు పెద్దఎత్తున సాగాయి. గత ఏడాదితో పోలిస్తే స్వీట్లు, కేకుల విక్రయాలు సుమారు 20 శాతం వరకు పెరిగాయని వ్యాపారులు తెలిపారు. స్వీట్స్ అమ్మకాలు భారీగా జరిగాయి. సగటున ఒక్కో దుకాణంలో 100 నుంచి 200 కిలోల స్వీట్లు విక్రయించినట్టు చెబుతున్నారు.

తెగ తాగారు

మద్యం అమ్మకాలకు న్యూ ఇయర్ కిక్

- 31న రూ.10.77 కోట్లు మద్యం విక్రయం
- 30న రూ.7 కోట్ల అమ్మకం
- సాధారణ రోజుల్లో రూ.4 కోట్ల వ్యాపారం



నగరంలోని ఓ మద్యం దుకాణం వద్ద మంగళవారం రాత్రి సందడి

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో మద్యం వ్యాపారులకు న్యూ ఇయర్ అమ్మకాలు కిక్ ఇచ్చాయి. డిసెంబరు 31వ తేదీన రికార్డుస్థాయిలో రూ.10.77 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. స్నేహితులతో కలిసి పార్టీ చేసుకునేందుకు చాలామంది 30నే మద్యం కొనుగోలు చేయడంతో ఆరోజు రూ.ఏడు కోట్ల సరకు అమ్మకాలు జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లా (జీవీఎంసీలో కలిసి ఉన్న అనకాపల్లి జిల్లాలోని ఐదు వార్డుల్లో తొమ్మిది దుకాణాలను మినహాయించి)లో 145 మద్యం దుకాణాలు, 119 బార్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో సాధారణ రోజుల్లో రూ.నాలుగు కోట్ల వరకూ మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. కొత్తసంవత్సరం వస్తుందంటే డిసెంబరు 31వ తేదీ రాత్రి మద్యం విక్రయాలు భారీగానే ఉంటాయి. గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, ప్రైవేటు బార్లలో రూ.పది కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్టు అంచనా. ఈ ఏడాది డిసెంబరు 31న ఉదయం పది నుంచి రాత్రి 11 గంటల వరకు 145 మద్యం దుకాణాల్లో రూ.8.89 కోట్లు విలువైన మద్యం అమ్ముడైంది. 119 బార్లలో రూ.1.55 కోట్లు, 12 స్టార్ హోటళ్లలో మద్యం విక్రయాలకు తాత్కాలిక లైసెన్స్ ఇవ్వడంతో వాటిల్లో రూ.16,67,890, ఆరు క్లబ్‌లలో రూ.7,89,657, ఏపీ టూరిజానికి చెందిన నాలుగు అవుట్‌లెట్లలో రూ.9,02,870 విలువైన మద్యం అమ్ముడైంది. మొత్తం డిసెంబరు 31న రూ.10,77,67,000 విలువైన మద్యం అమ్ముడైంది. ఇదికాకుండా కొంతమంది డిసెంబరు 31 వేడుకల కోసం ముందురోజే మద్యం కొనుగోలు చేసి భద్రపరచుకున్నారు. అందుకే 30న రూ.7 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అందులో సుమారు రూ.మూడు కోట్ల విలువైన మద్యం డిసెంబరు 31వ తేదీ కోసమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం డిసెంబరు 31న సుమారు రూ.13.77 కోట్ల విలువైన మద్యం తాగేసినట్టు లెక్క.

212 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు

- ఎక్కడికక్కడ తనిఖీల ద్వారా ఒక్క రోడ్డు ప్రమాదం కూడా చోటుచేసుకోకుండా నివారించగలిగాం
- పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి - 6లో

ఐకానిక్ భవనం ఐటీకి రిజర్వు



ఐకానిక్ భవనం నమూనా

- మల్టీ లెవెల్ కారు పార్కింగ్ బిల్డింగ్‌గా పేర్కొంటున్నా పై ఐదు అంతస్థులు ఐటీ కంపెనీలకు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం
- దరఖాస్తులు ఆహ్వానించిన అధికారులు
- వేలం నుంచి మినహాయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు
- దిగ్గజ సంస్థకు ఇవ్వాలని యోచన

వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్ ఎదుట నిర్మాణం



నిర్మాణంలో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నానికి మరో పెద్ద ఐటీ సంస్థ రాబోతున్నది. అది ఏమిటనేది త్వరలో వెల్లడి కానుంది. ఆ సంస్థ కోసం ముందుగానే 'సూపర్ ఐకానిక్ భవనాన్ని' రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు చేసి పెట్టింది. అదే వీఎంఆర్‌డీఏ సిరిపురంలో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ బిల్డింగ్. అది పేరుకు కారు పార్కింగ్ భవనమే అయినప్పటికీ అందులో ఐదు అంతస్థులు ఐటీ కార్యాలయాలకు అద్దెకు ఇచ్చేలా నిర్మించారు. సిరిపురంలో ఉద్యోగ భవన్ ముందున్న 1.72 ఎకరాల్లో రూ.80 కోట్ల అంచనా వ్యయంతో వీఎంఆర్‌డీఏ భవన నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు ఆ వ్యయం రూ.87.5 కోట్లకు చేరింది. ఇది 11 అంతస్థుల భవనం. కింద బేస్‌మెంట్‌లో మూడు, ఆ పైన మొదటి, రెండో అంతస్థులు (మొత్తం ఐదు అంతస్థులు) పార్కింగ్‌కు కేటాయించారు. వీటి విస్తీర్ణం 1.9 లక్షల చ.అడుగులు. వీటిలో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌ను షాపింగ్ మాల్ తరహాలో వాణిజ్య అవసరాలకు కోసం నిర్మించారు. ఆ పైన మూడో అంతస్థు నుంచి ఏడో అంతస్థు వరకు (ఐదు అంతస్థులు) ఐటీ కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించారు. వీటి విస్తీర్ణం 1.65 లక్షల చదరపు అడుగులు.

సూపర్ ఐకానిక్ భవనం

వీఎంఆర్‌డీఏ నగరం నడిబొడ్డున చేపట్టిన ఈ నిర్మాణం విశాఖలో సూపర్ ఐకానిక్ భవనాల్లో ఒకటిగా నిలుస్తోంది. పూర్తిగా ... మిగతా 6వ పేజీలో

వివాదాల నిలయం కేంద్ర కారాగారం

అధికారులకు సిబ్బందికి మధ్య కోల్డ్‌వార్



విశాఖ కేంద్ర కారాగారం

- గత నెల రోజులుగా ఏదో ఒక రచ్చ
- ఖైదీలకు గంజాయి తీసుకువెళుతూ పట్టుబడ్డ ఫార్మసిస్టు
- ఖైదీల నుంచి రాత్రి వేళ కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్లు వెళుతున్నట్టు గుర్తింపు
- సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్‌లపై వేటు
- తాజాగా ఇద్దరు వార్డర్లపై అనుమానంతో తనిఖీ చేయించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్
- జైలు ఎదుట వార్డర్లు, కుటుంబ సభ్యులు ఆందోళన
- మూకుమ్మడిగా 37 మంది వార్డర్లను బదిలీ చేసిన జైళ్ల శాఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్ర కారాగారంలో అధికారులకు, సిబ్బందికి మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. జైలు లోపలకు గంజాయి తీసుకువెళుతూ ఫార్మసిస్టు పట్టుబడినప్పటి నుంచి తరచూ ఏదో ఒక వివాదం తెరపైకి వస్తోంది. ఈ నేపథ్యంలో జైలులో ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టిసారించింది.

రాష్ట్రంలోనే అతిపెద్ద జైలుగా గుర్తింపుపొందిన అడవివరంలోని కేంద్ర కారాగారంలో 2,200కి పైగా ఖైదీలు ఉంటున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, విధి నిర్వహణలో అలసత్వం కారణంగా కొంతమంది ఖైదీలు జైలులో ప్రత్యేక సదుపాయాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల కిందట రిమాండ్ ఖైదీగా ఉన్న రౌడీషీటర్ గుర్రాల సాయి కోర్టు నుంచి తిరిగి జైలుకు వెళుతుండగా ఎస్కార్ట్ సిబ్బందిపై తిరగబడ్డాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు మొదలయ్యాయి. ఇదిలావుండగా నెల రోజుల కిందట జైలు ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు తన లంచ్ బ్యాగ్‌లో గంజాయి తీసుకువెళుతూ ప్రధానద్వారం వద్ద గార్డు సిబ్బందికి పట్టుబడ్డాడు. దీంతో ఖైదీలకు గంజాయి సరఫరా అవుతుందనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్‌గా ... మిగతా 6వ పేజీలో

5న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహణ

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి', ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)'కు సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ...ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (9985411659, 9492452283) చేయించుకోవాలి. పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ముందుగా వచ్చిన వారికి మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం లభించనుంది.

విమానాశ్రయం ప్రగతి పథం

రోజుకు 30 విమానాలు
9,000 మంది రాకపోకలు



- గడచిన ఏడాది విజయవాడ, హైదరాబాద్‌లకు అదనపు సర్వీస్‌లు
- బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు కొత్తగా విమానాలు
- త్వరలో మల్కన్‌గిరికి...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయం నూతన సంవత్సరంలో కొత్త కబురు వినిపించబోతోంది. మల్కన్‌గిరి నుంచి విశాఖకు విమాన సర్వీస్ నడపడానికి ఒడిశా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇండియా వన్ ఎయిర్ సంస్థ ఈ విమానం నడపనున్నది. త్వరలోనే ఈ సర్వీస్ ప్రారంభం కానుంది.

విమానాశ్రయం గడచిన ఏడాది (2024) గణనీయమైన ప్రగతి సాధించింది. రాష్ట్ర రాజధాని విజయవాడకు గతంలో కేవలం ఒకే ఒక సర్వీస్ ఉండగా, అదనంగా మరో రెండు ప్రారంభమయ్యాయి. అలాగే పూర్వ రాజధాని హైదరాబాద్‌కు కూడా మరో సర్వీస్ పెరిగింది. ఇప్పుడు రోజుకు 30 విమానాలు వచ్చి వెళుతున్నాయి. అంటే 60 ఆపరేషన్లు. రోజుకు తొమ్మిది వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, పోర్టు బ్లెయిర్, కర్నూలు, జైపూర్‌లకు దేశీయ సర్వీస్‌లు నడుస్తున్నాయి. ఇక అంతర్జాతీయ సర్వీస్‌లు గతంలో ఒక్క సింగపూర్‌కే ఉండగా, 2024లో బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు విమానాలు ప్రారంభమయ్యాయి. దుబాయ్‌కు కూడా సర్వీస్ పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశాఖ మాజీ ఎంపీ, ప్రస్తుతం ఒడిశా గవర్నర్‌గా నియమితులైన కంభంపాటి హరిబాబు ద్వారా విశాఖ నుంచి భువనేశ్వర్‌కు కొత్త విమాన సర్వీస్ నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.


అందుబాటులోకి వచ్చిన అదనపు వసతులు

గత ఏడాది ప్రయాణికులకు అవసరమైన వసతులు సమకూర్చారు. చెక్ ఇన్ కౌంటర్లు పది ప్రారంభించారు. ఇన్ లైన్ బ్యాగేజ్ హ్యాండ్లింగ్ ... మిగతా 6వ పేజీలో

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసుపై వివాదం

60 ఏళ్లు నిండిన 400 మంది పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ నోటీసులు

- ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా 62 ఏళ్లు వర్తింపజేయాలని కార్మిక సంఘాల డిమాండ్
- నిబంధనలు అంగీకరించవంటున్న అధికారులు
- ఆందోళనకు సంఘాల సమాయత్తం



విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితిపై వివాదం నెలకొంది. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచారు. అదే జీవీఎంసీలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అనధికారికంగా అమలు చేస్తూ వస్తున్నారు. ప్రజారోగ్య విభాగంలో సుమారు ఆరు వేల మంది, నీటి సరఫరా, యూజీడీ ఇతర విభాగాల్లో మరో రెండు వేల మంది వరకూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే ప్రజారోగ్య విభాగంలో 60 ఏళ్లు దాటిన 400 మంది కార్మికులకు ఉద్యోగ విరమణ చేయాలంటూ ... మిగతా 6వ పేజీలో

ఏళ్ల తరబడి తిష్ఠ

వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో దశాబ్దానికిపైగా కొనసాగుతున్న కొందరు ఉద్యోగులు

- అడ్డగోలు వ్యవహారాలకు కేంద్రంగా మారిన ఆర్డీ ఆఫీస్
- ఏ ఫైలు కదలాలన్నా చేయి తడపాల్సిందే...
- పట్టించుకోని ఉన్నతాధికారులు



విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఆర్డీ)లో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. పది, పదిహేనేళ్ల నుంచి ఒకేచోట కొనసాగుతూ కార్యాలయాన్ని అడ్డగోలు వ్యవహారాలకు కేంద్రంగా మార్చేశారు. నియామకాలు, బదిలీలు, పదోన్నతులు వంటి సమయంలో జేబులు నింపుకుంటున్నారు. ఆర్డీ కార్యాలయంలో ఫైలును బట్టి రేటు ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి వ్యవహారాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోకపోవడంతో సదరు ఉద్యోగులు ఆడిందే ఆట, పాడిందే పాటగా ... మిగతా 6వ పేజీలో

శిల్పారామంలో నేటి నుంచి చేనేత వస్త్ర మేళా

మధురవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శిల్పారామంలో గురువారం నుంచి అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శన జరగనుంది. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మేళాను ప్రారంభిస్తారని శిల్పారామం సీఈఓ వి.స్వామినాయుడు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 16 వరకు ఉండే ఈ మేళాలో దేశవ్యాప్తంగా పేరొందిన వంద మంది చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని చెప్పారు. భారత ప్రభుత్వ చేనేత అభివృద్ధి కమిషన్ సౌజన్యంతో ఈ మేళాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

మధురవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల నూతన డైరీ, క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగదీశ్వరరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ముందుగా ఉద్యోగులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ షునేంద్రబాబుతో కలిసి డీఎంహెచ్‌ఓ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మం, సభ్యులు గోపి, మోహన్, శశిభూషణ్ పాల్గొన్నారు.

3 నుంచి డీఎస్ఐ వార్షిక సమావేశాలు

ఎండాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్), డెర్మటాలజీ, వెనిరాలజీ, లెపరసీ (డీవీఎల్). పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 5 వరకు డెర్మటో పాథాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (డీఎస్ఐ) 27వ వార్షిక సమావేశాలు జరగనున్నట్టు గీతం డెర్మటాలజీ విభాధిపతి డాక్టర్ బీవీ రామచంద్ర, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ డి. రాజా ప్రమీలా తెలిపారు. బుధవారం వారు ప్రకటన విడుదల చేశారు. సమావేశాలకు దేశం నలుమూలలు నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఛాలెంజింగ్ దా డొగ్‌మా అన్న అంశంపై జరిగే ఈ సమావేశాల్లో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు హాజరై ప్రసంగిస్తారని చెప్పారు.

గోదాదేవికి 17వ పాశురం విన్నపం

సింహాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రభాతారాధనలు తరువాత ఉత్సవ మూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. నాదస్వరాలపనలు, వేదమంత్రాల నడుమ తిరువీధి ఉత్సవం జరిపారు. అనంతరం ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 17వ పాశురాన్ని విన్నపాలు చేశారు.

ఏళ్ల తరబడి తిష్ఠ

... 5వ పేజీ తరువాయి

మారింది. ఆర్డీ, డీడీ వంటి ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని కూడా ఇద్దరు ఉద్యోగులు కీలుబొమ్మలను చేసి ఆడిస్తుంటారనే ప్రచారం ఉంది. అందులో ఒకరు గడిచిన 15 ఏళ్ల నుంచి ఆర్డీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గానే పనిచేస్తున్నారని, పదోన్నతుల్లో తన పేరు లేకుండా జాగ్రత్త పడుతుంటారు. వైద్య విధాన పరిషత్ నుంచి వచ్చిన ఒక ఉద్యోగి నుంచి భారీగానే వసూలు చేసినట్టు చెబుతున్నారు. అలాగే, ఒక ఫార్మసిస్టు తప్పుడు పనిచేసి ఒక కేసులో ఇరుక్కుపోగా.. శాఖాపరమైన విచారణ లేకుండా చేసేందుకు గట్టిగానే డబ్బులు తీసుకున్నట్టు సమాచారం.

ముందుగానే బేరాలు

ఆర్డీ కార్యాలయం పరిధిలో ఆరు జిల్లాలు ఉన్నాయి. సుమారు 20 కేడర్లకు సంబంధించిన మూడు వేల మందికిపైగా ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, సీనియారిటీ జాబితాల తయారీ వంటి వ్యవహారాలన్నీ ఇక్కడ జరుగుతుంటాయి. అలాగే ఈ కార్యాలయం కేంద్రంగా కొన్ని పోస్టులు భర్తీ చేస్తుంటారు. ఆయా సమయాల్లో కార్యాలయ ఉద్యోగులపై వచ్చే ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేసి కార్యాల యాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.



సందర్శకులతో సందడిగా ఉన్న రుషికొండ బీచ్



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పద్మనాభం మండల నాయకులు

ఉరకలేసిన ఉత్సాహం

- నియోజకవర్గంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- వీధుల్లో సందడే సందడి
- డ్యాన్సులతో యువత కేరింత
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు, తీర ప్రాంతాలు

భీమునిపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే వీధుల్లో సందడి మొదలైంది. యువత కేక్ కటింగ్‌లు, డ్యాన్సులతో సందడి చేశారు. భీమిలి పట్టణంలోని గొల్లలపాలెం కేజీబీవీలో ఎస్ఎంసీ చైర్మన్ గందవరపు కుమార్ కేక్ కట్ చేశారు. టీడీపీ కార్యాలయంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 4వ వార్డు జేవీ అగ్రహారంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు అప్పలకొండ ఆధ్వర్యంలోనూ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు (వాసురాజు) ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీకి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీవో హనుమంతరావు, ఈవోపీఆర్డీ రమేష్‌నాయుడు, కార్యాలయం సూపరింటెండెంట్ నగేశ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కిటకిటలాడిన ఆలయాలు, బీచ్‌లు

సాగర్‌నగర్ : బీచ్ రోడ్డులోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. రుషికొండ టీడీపీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నాలుగు నుంచి ఐదున్నర వరకు అర్చకులు స్వామివారికి తిరుప్పావై, శుద్ధి, ధనుర్మాస ఆరాధన, తోమాల సేవ జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. దాస సాహిత్య ప్రాజెక్టు శ్రీమన్నారాయణ భజన కోలాట మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను పులకింపజేసింది. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్, రామానాయుడు స్టూడియో, హోటళ్లు, రెస్టారెంట్లు పర్యాటకులతో కళకళలాడాయి.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి యువత వీధుల్లో కేకులు కట్ చేసి, డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ఉదయం పలువురు ఆలయాలకు వెళ్లి పూజలు జరిపారు. ఏడో వార్డులోని మానం ఆంజనేయనగర్‌లో లలిత త్రిపురసుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

జనసేన కార్యాలయంలో...

ఎండాడ : ఎండాడలో ఉన్న జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం కార్యాలయంలో 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు. 8వ వార్డు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నగరంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సారిపల్లి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, పరమేశ్వరరావు, అశోక్, 9వ వార్డు అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు తహసీల్దార్ కె. ఆనందరావు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీలో గంటాను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కె. రమణ, మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కాళ్ల వెంకట సత్యనారాయణ కూడా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. మద్దిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రాంబాబు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె. తులసి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



భీమిలి : టీడీపీ కార్యాలయంలో వేడుకలు



పాసి నరసింగరావుకు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు

టీడీపీ కార్యాలయంలో వేడుకలు



గండి బాబ్జీకి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు బాబ్జీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, నాయకులు వెల్లంకి భరత్, తెలుగు మహిళలు ఎక్కువగా హాజరయ్యారు. అలాగే జిల్లా పార్టీ కార్యాలయంలో దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌కు నాయకులు, వార్డు అధ్యక్షులు శుభాకాంక్షలు తెలిపారు.

కన్నుల పండువగా అప్పన్న తిరువీధి



స్వామివారికి తిరువీధి ఉత్సవం జరుపుతున్న అధికారులు, వైదికులు

సింహాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న పగల్‌పత్ ఉత్సవాల్లో భాగంగా తిరువీధి బుధవారం కన్నుల పండువగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి బంగారు తొళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. ఉపచారాలు సమర్పించిన తరువాత బోయీలు హరినామ స్మరణ చేస్తూ ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదోచ్ఛారణల నడుమ ఆలయ బేడా మండప ప్రదక్షిణలు చేశారు. మార్గంలో స్వామివారిని వయ్యారి నడకలతో ఊపుతూ అష్టదిక్పాలకులకు ఉపచారాలు సమర్పించారు. అనంతరం ఆస్థానమండపంలో ప్రత్యేక వేదికపై ఉంచి అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని కొన్ని పాశురాలను అనుసంధానం చేశారు.

చిల్లపేట చెరువు కాలువలో పూడికతీత



పూడిక పనులను పరిశీలిస్తున్న జడ్పీ ప్రసన్న

తగరపువలస, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రహదారిలో ఉన్న చిల్లపేట చెరువు కాలువలో పేరుకుపోయిన పూడికను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు బుధవారం తొలగించారు. కాలువ పూడికతో నిండిపోయిందని, వైసీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేయడంతో జడ్పీ ప్రసన్నరాణి, శానటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు కాలువను పరిశీలించి, పూడికలు తొలగించే పనులు చేపట్టారు.

సింహగిరి అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే గంటా



గంటాకు ఏటికొప్పాక వెంకన్న స్వామి చెక్క బొమ్మను బహూకరిస్తున్న దేవస్థానం పర్యవేక్షణాధికారి పి. పద్మనాభరాజు

సింహాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే ప్రసాద్ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు పనులు జరుగుతున్నాయని చెప్పారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు కొండపై ఒక రోజు సంతోషంగా ఉండేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. బీఆర్‌టీఎస్ కారిడార్ బాధితుల టీడీఆర్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పంచ గ్రామాల భూ వివాదం కూడా వీలైనంత త్వరలోనే పరిష్కారం అవుతుందని తెలిపారు. కాగా గంటాకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. ఆలయ పండితులు చతుర్వేద ఆశీర్వచనాలివ్వగా, ఈఓ శాలువతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. గంటాతో పాటు భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఉన్నారు. కాగా ఎమ్మెల్యే గంటాకు ఉమ్మడి విశాఖ జిల్లా ఏటికొప్పాకకు చెందిన కళాకారులు తయారు చేసిన వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని దేవస్థానం పర్యవేక్షణాధికారి పి. పద్మనాభరాజు బహుమతిగా అందజేశారు.

వెంకన్నకు నవనీత సేవ



భీమునిపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామిని భక్తులు బుధవారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు ముందుగా అర్చకుడు రొంపిచెర్ల కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. కృష్ణా కాలనీలో వెంకటగిరిపై ఉన్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి, మినీ స్టేడియం సమీపంలో ఉన్న ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి నవనీత సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయంలో ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, శ్రీరామచంద్రమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, పుశిరికల తాతాజీ, శర్మ స్వామివారి క్యాలెండరును ఆవిష్కరించారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి గురువారం వరకూ నవనీత సేవలో దర్శనం ఇస్తారని ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.అప్పలనాయుడు తెలిపారు. పట్టణవాసుల గ్రామ దేవత నూకాలమ్మను కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

నాగమయ్యపాలెం తీరంలో పడవ బోల్తా

సురక్షితంగా ఒడ్డుకు చేరిన ఏడుగురు మత్స్యకారులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖకు చెందిన మర పడవ భీమిలి తీరం దాటిన తర్వాత నాగమయ్యపాలెం సమీపంలో మోటారు పని చేయకపోవడంతో బోల్తా పడింది. ఆ సమయంలో పడవలో ఏడుగురు మత్స్యకారులు ఉన్నారు. వారంతా పడవతో పాటు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. బాధితుల్లో ఒకరైన నూకరాజు తెలిపిన వివరాలు మేరకు.. విశాఖ ఫిషింగ్ జెట్టీ నుంచి మైలపల్లి చిన్నారావు, చింతపల్లి నూకరాజు, చింతపల్లి ముత్తురాజు, తెడ్డు ఎల్లాజీ, కాసరపు నూకరాజు, పూడిమడక గ్రామానికి చెందిన తాతాజీ, జాలారిపేటకు చెందిన గురునాథ్ చేపల వేట కోసం బుధవారం ఉదయం బయలు దేరారు. నాగమయ్యపాలెం సమీపంలోకి రాగానే మోటారు పని చేయకపోవడంతో పడవ మొరాయించి, బోల్తా పడింది. దీంతో వారంతా అతి కష్టం మీద, పడవతో సహా తీరానికి చేరారు. సంద్రంలోనే తాతాజీకి ఫిట్స్ రావడం, గురునాథ్ కాలికి గాయం కావ డంతో ఒడ్డుకు చేరిన తరువాత వారిని ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు.వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని బాధితులు తెలిపారు.



ప్రాణాలతో బయటపడిన మత్స్యకారులు, వెనుక లంగరు వేసిన పడవ



పొగమంచుతో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలు

భీమిలిలో దట్టంగా పొగమంచు

భీమునిపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పట్టణాన్ని బుధవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం ఎనిమిదిన్నర అయినా మంచు తెరలు వీడలేదు. దీంతో వేకువజామున ఆలయాలకు వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 గంటల వరకూ మంచు కనిపిస్తూనే ఉంది.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దర్శనానికి భక్తులు బుధవారం పోటెత్తారు. ఉదయం ఆరు గంటలకే క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీ వల్ల సిఫార్సులను చాలావరకు నిరోధించే యత్నంలో భాగంగా లిఫ్ట్, ప్రధాన రాజగోపురం, దక్షిణ రాజగోపరాల నుంచి ఆలయ ప్రవేశాలను నిషేధించారు అధికారులు. అడ్డదారుల ప్రవేశాలను నియంత్రించడంతో భక్తులందరికీ స్వామివారి దర్శనం లభించింది.

ఐకానిక్ భవనం ఐటీకి రిజర్వు

... 5వ పేజీ తరువాయి

అద్దాలతో క్రూయిజ్ షిప్ మోడల్‌లో రూపుదిద్దుకున్న ఈ భవనంలో ఐదో అంతస్థు నుంచి ఎదురుగా సముద్రం కనిపిస్తుంది. వందలాది వాహనాలకు పార్కింగ్ సదుపాయం కలిగి, నగరంలో మధ్యలో ఉండడంతో దీనిని టీసీఎస్ కంటే పెద్ద ఐటీ సంస్థకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే దీన్ని రిజర్వు చేసి పెట్టారు.

వేలం నుంచి మినహాయింపు

ఈ భవనంలో కమర్షియల్ షాపుల కోసం ఉద్దేశించిన గ్రౌండ్ ఫ్లోర్, మూడో అంతస్థు నుంచి ఏడో అంతస్థు వరకు ఐటీ కంపెనీలకు అద్దెకు ఇస్తామని వీఎంఆర్‌డీఏ ప్రకటించి దరఖాస్తులు ఆహ్వానించింది. అనేక ఐటీ సంస్థలు ముందుకు వచ్చాయి. అయితే అద్దె, నిర్వహణ వ్యయం, జీఎస్టీ కలుపుకొంటే రేట్లు కొంచెం అధికంగా ఉన్నాయని, కాసింత తగ్గించాలని వారు వీఎంఆర్‌డీఏ అధికారులను కోరారు. వారి అభ్యర్థనను పరిశీలించేలోపే ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. అనేక ఐటీ సంస్థలు విశాఖలో కార్యకలాపాల నిర్వహణకు ముందుకు వస్తున్నాయని, భవనాల అవసరం చాలా ఉందని, తొందరపడి చిన్న చిన్న సంస్థలకు ఐకానిక్ భవనాన్ని కేటాయించవద్దని సూచించారు. దాంతో రెండు రోజుల క్రితం (డిసెంబరు 30వ తేదీ) నిర్వహించిన వేలం నుంచి ఆ భవనాన్ని మినహాయించారు.

నెలాఖరుకు సిద్ధం

ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనాన్ని ఈ నెలాఖరుకు పూర్తిచేస్తాం. ముందు వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలని అనుకున్నాము. కానీ విశాఖ ఐటీ హబ్‌గా మారుతున్న తరుణంలో పెద్ద ఐటీ సంస్థకు భవనం మొత్తం ఇస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. పార్కింగ్ అందరికీ ఉపయోగపడుతుంది. పై అంతస్థులు మాత్రం ఐటీ సంస్థకే ఇస్తాము.

వివాదాల నిలయం.. కేంద్ర కారాగారం

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న కిషోర్‌తోపాటు అదనపు సూపరిటెండెంట్ వెంకటేశ్వర్లును బదిలీ చేశారు. ఖైదీలకు సిబ్బంది ద్వారా గంజాయి చేరడంతోపాటు రాత్రి సమయంలో లోపల నుంచి సెల్ ఫోన్ ద్వారా కాల్స్ బయటకు వెళుతున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. కేంద్ర కారాగారం లోకేషన్ నుంచి సెల్‌ఫోన్ కాల్‌డేటా రికార్డులు తీయగా రాత్రి సమయంలో ఖైదీలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఫోన్లు మాట్లాడుతున్నట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో కిషోర్, వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమితులైన మహేష్‌బాబు జైలులో నిబంధనలు కఠినంగా అమలుచేయడం మొదలుపెట్టారు. జైళ్ల శాఖ మాన్యువల్‌లో పేర్కొన్నారంటూ అనుమానం ఉన్న జైలు సిబ్బందిని తనిఖీ చేయడం మొదలుపెట్టారు. సిబ్బంది లంచ్ బ్యాగ్‌లను లోపలకు అనుమతించడం మానేశారు. సెల్‌ఫోన్‌లను కూడా గేటు వద్దనే డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ఈపరిణామం కొందరికి ఇబ్బందిగా మారింది. ఇద్దరు వార్డర్లు తరచూ గంజాయి తీసుకువెళుతున్నట్టు సూపరింటెండెంట్‌కు అనుమానం రావడంతో నాలుగు రోజుల కిందట వారిద్దరినీ ప్రైవసీ గదిలోకి తీసుకువెళ్లి తనిఖీ చేశారు. అయితే తోటి సిబ్బంది, ఖైదీలు ఎదురుగా తమను తనిఖీ చేయడం అవమానంగా భావించిన వార్డర్లు తమ ఆవేదనను తోటి వార్డర్ల వద్ద వెళ్లబోసుకున్నారు. దీంతో అంతా కలిసి జైలు ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగగా, ఇతర అధికారులు వచ్చి నచ్చజెప్పడంతో విరమించారు. కొద్దిసేపటికే సూపరింటెండెంట్ తమను కించపరిచేలా మాట్లాడారంటూ కుటుంబ సభ్యులతో సహా జైలు గేటు వద్ద మళ్లీ ఆందోళనకు దిగారు. జైళ్ల శాఖ డీఐజీ హరికిరణ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. తమ క్వార్టర్లలో పోలీసుల సహాయంతో తనిఖీలు చేయించారంటూ వార్డర్లు మరోసారి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈక్రమంలో జైళ్ల శాఖ అధికారులతో కొందరు వార్డర్లు వాగ్వాదానికి దిగారు. ఈ విషయం డీఐజీ ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదించడంతో ఇక్కడ పనిచేస్తున్న 37 మంది వార్డర్లను ఇతర జైళ్లకు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ వివాదానికి ఇకనైనా ఫుల్‌స్టాప్ పడుతుందా...లేదా...అనేది చూడాలి.

విమానాశ్రయం ప్రగతి పథం

... 5వ పేజీ తరువాయి

సిస్టమ్ ఏర్పాటుచేశారు. బయటకు వెళ్లేందుకు కొత్త గేటు ఒకటి తెరిచారు. నాలుగు ఇమిగ్రేషన్ కౌంటర్లు పెట్టారు. మరో రెండు ముందస్తు చెకింగ్ కౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి. దేశీయ ప్రయాణికుల కోసం అదనంగా 6 వేల చ.అ. లాంజ్ ఏర్పాటుచేశారు. ఎగ్జిక్యూటివ్ పాసింజర్ లాంజ్ కూడా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రి పెయిడ్ ట్యాక్సీలకు తోడుగా ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సర్వీస్‌లకు అవకాశం కల్పించారు. ప్రయాణికులు వారి గుర్తింపు కార్డు పరిశీలనకు ఎక్కువ సమయం క్యూలో నిల్చోకుండా డిజి-యాత్ర విధానం అమలులోకి తీసుకువచ్చారు. కేవలం ముఖ గుర్తింపుతోనే క్లియరెన్స్ లభిస్తోంది.

డిసెంబరులో 2.8 లక్షల మంది ప్రయాణం

2024 అక్టోబరులో 1,921 విమానాల ద్వారా 2,62,045 మంది ప్రయాణం చేయగా, నవంబరులో 1,845 విమానాల ద్వారా 2,49,937 మంది ప్రయాణించారు. డిసెంబరులో ప్రయాణికుల సంఖ్య 2,80,000 వరకు ఉంటుందని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు తెలిపారు. గత ఏడాది డిసెంబరులో ఈ సంఖ్య 2.19 లక్షలే ఉండగా ఈ డిసెంబరులో 60 వేల మంది పెరిగారన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసుపై వివాదం

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 62 ఏళ్ల పరిమితి ఉండడంతో వారికి కూడా అదే నిబంధన వర్తిస్తుందని, హఠాత్తుగా 60 ఏళ్లు దాటినందున ఉద్యోగ విరమణ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని కార్మిక సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కలిశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నిబంధన ప్రకారం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 ఏళ్లు మాత్రమేనని, తాను రెండేళ్లు పెంచి 60 ఏళ్ల వరకూ పనిచేసే అవకాశం కల్పించానని కమిషనర్ వివరణ ఇచ్చారు. అందుకు సంబంధించి ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వులను యూనియన్ నేతలకు చూపించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 62 ఏళ్ల పరిమితి వర్తింపజేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. అయినప్పటికీ తానేమీ చేయలేనని కమిషనర్ చెప్పడంతో, ఆందోళనకు దిగాలని నిర్ణయించామని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అరవై ఏళ్లు నిండినవారిని ఉద్యోగం నుంచి తొలగిస్తే కనీసం వారి వారసులకు అవకాశం కల్పించాలని కోరినా అధికారులు పట్టించుకోకుండా కొత్తవారిని నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని చూస్తున్నారని యూనియన్ నేతలు ఆరోపిస్తున్నారు.

212 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం రాత్రి మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 212 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుచేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఎక్కువ కేసులు నమోదుచేశామన్నారు. డిసెంబరు 31 సందర్భంగా నగరంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 28 చోట్ల ప్రత్యేక బృందాలు బ్రీత్ అనలైజర్లతో తనిఖీ చేపట్టాయన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా ఈ ఏడాది ఒక్క ప్రమాదం కూడా జరగకుండా అడ్డుకోగలిగామన్నారు. అలాగే సైలెన్సర్లు మార్చి ఎక్కువ శబ్దం వచ్చేలా వాహనాలను నడుపుతున్న ముగ్గురిపై, బీచ్‌రోడ్డుతోపాటు నగరంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్టు సీపీ చెప్పారు. 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు మొదలైన తనిఖీలు బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయన్నారు.

ఇంటర్ విద్యార్థులను కొట్టిన లెక్చరర్ సస్పెన్షన్

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస బాసర జూనియర్ కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్ పి. మహేశ్‌ను యాజమాన్యం సస్పెండ్ చేసింది. హోమ్ వర్క్ చేయలేదని లెక్చరర్ మహేశ్ 20 మందికి పైగా విద్యార్థులను మంగళవారం చావగొట్టారు. విద్యార్థులు కొందరు గాయాల ఫొటోలు తీసి మీడియాకు పంపించారు. విద్యార్థి సంఘం ఏబీవీఎస్‌ఓ దీనిపై ఆర్ఐఓకు ఫిర్యాదు చేయగా ఆయన వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎట్టకేలకు మహేశ్‌ను సస్పెండ్ చేసినట్టు యాజమాన్యం తెలిపింది.

విశ్వరూపాలంకరణలో వేంకటేశ్వరస్వామి



ఎంవీపీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస మహా పర్వదినం సందర్భంగా వేంకటేశ్వరస్వామిని విశ్వరూప అలంకరణ చేశారు. అలాగే ప్రసన్నాంజనేయస్వామిని వివిధ రకాల పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. శ్రీవల్లీ దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్య స్వామిని వివిధ రంగుల ఊలు దండలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు



పాడైన బస్సు ముందు భాగం

ఆరిలోవ జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులోని శ్రీకాంత్ నగర్ లే అవుట్‌లో గల రెండో లైన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఓ ట్రావెల్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్తంభం పడిపోగా, బస్సు ముందు భాగం కొంత మేరకు పాడైంది. డ్రైవర్ అతి వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. బస్సు ఖాళీగా ఉండడం, ఆ విద్యుత్ స్తంభానికి తీగలు బిగించకపోవడంతో ముప్పు తప్పింది. ఘటనపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు విద్యుత్ శాఖ ఏఈ హైమ తెలిపారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ఎంవీపీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రూ. 33 వేలు స్వాధీనం చేసుకున్నట్టు క్రైమ్ ఏడీసీపీ ఎం.మోహన్‌రావు తెలిపారు. ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశీలుమెట్ట వద్ద ఉన్న సవేరా హోటల్‌లో డిసెంబరు 27న ఓ వ్యక్తి బస చేశారు. అతడిపై విశ్వత్‌సూర్య, ఎన్.బాలరాజు, ఎస్.వంశీ, పి.బాలరాజు, డి.గణేష్, ఎస్. మణికంఠ అనే యువకులు దాడి చేసి ఫోన్లు లాక్కుని, గూగుల్ పే, ఏటీఎం కార్డు ద్వారా రూ. 33 వేలు కాజేశారు. నిందితులను ఎంవీపీ కాలనీలో అరెస్టు చేసినట్టు ఏడీసీపీ తెలిపారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 48, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 48 దొండకాయలు 52, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36 దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 60, కీర దోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 38, కంద 60, దేముదు చిక్కుడు 50, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ఉత్సాహంగా నూతన సంబరాలు

» కొత్త సంవత్సర శుభాకాంక్షల వేళ సందడే సందడి » ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కట్టిన అధికారులు, ప్రముఖులు



సిరిపురం : ఆఫీసర్స్ క్లబ్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ ఆర్కే మీనా, మాజీ డీజీపీ సాంబశివరావు



ఎంవీపీ కాలనీ : ఎమ్మెల్యే వెలగపూడికి శుభాకాంక్షలు చెబుతున్న వీఎంఆర్డీఏ చైర్మన్



మేయర్ హరి వెంకటకుమారికి శుభాకాంక్షలు చెబుతున్న జీవీఎంసీ అధికారులు, వైసీపీ కార్పొరేటర్లు తదితరులు

నూతన సంవత్సరం వేడుకలను అన్ని వర్గాల వారు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా.. యువత సందడి చేశారు. కార్యాలయాల్లో ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ పార్టీల నేతలు ఒకరికొకరు శుభాకాంక్షలు గడుపుతూ ఆనందం పంచుకున్నారు. ప్రజాప్రతినిధుల వద్దకు అధికారులు, నేతలు, కార్యకర్తలు వెళ్లి కేక్‌లు కట్ చేసి, దుశ్శాలువలు కప్పి తమ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంవీపీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబును ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో బుధవారం వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం ఉదయం నుంచి సందడిగా మారింది. వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మద్దిలపాలెం : నూతన సంవత్సరం సందర్భంగా శివాజీపాలెంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ నివాసంలో బుధవారం సందడి నెలకొంది. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చి వంశీకృష్ణకు నూతన శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి చిత్రపటాలు అందించి, శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసైనికులు కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేక్ కట్ చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి ఒకరికొకరు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిరిపురంలో..

సిరిపురం : ప్రజలందరికీ నూతన సంవత్సరంలోని కొత్త అవకాశాలు, విజయాలు, సంతోషాన్ని అందజేయాలని భగవంతుని కోరుకుందామని అడిషనల్ డీజీపీ ఆర్కే మీనా, మాజీ డీజీపీ జి.సాంబశివరావు పేర్కొన్నారు. సిరిపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్కే మీనా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ డీజీపీ జి.సాంబశివరావు మాట్లాడుతూ మనకొచ్చే మంచి అవకాశాలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి స్థానంలో నిలిచేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం అన్నమయ్య కీర్తనలు, కాంతార చిత్రంలోని గీతాలకు కళాకారులు అభినయించిన తీరు ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ నటుడు ప్రసన్నకుమార్, రిటైర్డ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాస్, ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఆఫీసర్స్ క్లబ్స్ సెక్రటరీ డా. శాంతారావు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : పెదగదిలి మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద నూతన సంవత్సర సందడి కనిపించింది. కార్యాలయం అంత అధికారులతో నిండింది. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి పలువురు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించిన శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ప్రధాన ఇంజనీర్లు, సిటీ ప్లానర్లు, డీసీఆర్ ప్రాజెక్టు డైరెక్టర్, యూసీడీ కార్యదర్శులు, జీవీఎంసీ అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది, వైసీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు.


సోనోవిజన్ లక్కీ డ్రా విజేతలు వీరే...

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ డైమండ్ పార్క్ సమీపంలోని ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ షోరూం సోనోవిజన్‌లో బుధవారం సాయంత్రం లక్కీడ్రా తీశారు. రాత్రి 7 గంటలకు జరిగిన కార్యక్రమంలో హోండా అమెజ్ కారు, రెండు 55 ఇంచెస్ ఎల్ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ బహుమతులుగా అందించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. వందలాది మంది కొనుగోలుదారుల సమక్షంలో లక్కీడా తీసి విజేతలను ఎంపిక చేశారు. డ్రాలో హోండా అమేజ్ కారును (కూపన్ నంబరు 015641) గాజువాకకు చెందిన సీహెచ్‌వీ రమణ దక్కించుకున్నారు. 55 ఇన్చెస్ ఎల్ఈడీ టీవీలను (కూపన్ నెం.26709) మద్దిలపాలేనికి చెందిన ఎం.గుణసుందరి, (కూపన్‌నెం.40939) తాటిచెట్లపాలేనికి చెందిన సతీష్ కుమార్ గెలుచుకున్నారు. సీతమ్మపేటకు చెందిన సీహెచ్ రమేశ్‌కుమార్ (కూపన్ నెం.91463) రిఫ్రిజిరేటర్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌ను సోనోవిజన్ అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ చైన్‌స్టోర్ సోనోవిజన్‌లో అని, తమ వద్ద అన్ని పెద్ద కంపెనీల ఎల్ఈడీ టీవీలు,మొబైల్స్, ల్యాప్‌టాప్స్, రిఫ్రిజిరేటర్స్, వాషింగ్ మెషీన్స్, ఏసీలు, కిచెన్ అప్లయెన్సెస్ ఎప్పుడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభిస్తున్నాయన్నారు. 22.5 శాతం వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్ ఈ సారి ప్రత్యేకతని, ఒక ఈఎంఐ రిఫండ్ ఇంకా అనేక ఆఫర్స్ అందిస్తున్నామన్నారు.



విజేతలను ప్రకటిస్తున్న సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి, కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు, దక్షిణ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన ఈస్ట్ షిర్డీ సాయిబాబా, వివిధ రకాల వంటకాలతో నైవేద్యం

పెదవాల్తేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఈస్ట్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సందడి నెలకొంది. ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. వివిధ రకాలు పుష్పాలు, రకరకాల పండ్లను బాబాకు సమర్పించారు. అనేక ప్రసాదాలను సమర్పించారు. ఆలయ ఆవరణలో పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ గడిపారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : నూతన సంవత్సరం నేపథ్యంలో ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు బుధవారం వేకుల జాము నుంచి క్యూ కట్టారు. యువత ఉత్సాహంగా తరలివచ్చారు. కొందరు ఆలయ పరిసరాల్లో కేక్‌లు కట్ చేసిన వేడుకలు జరుపుకున్నారు. అలాగే చర్చిల్లో కూడా సందడి కనిపించింది. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : నూతన సంవత్సర నేపథ్యంలో ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. తొలి పూజ నిర్వహించుకునే భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణ లు వెంకన్నస్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ సీఐపై సీపీకి ఫిర్యాదు


ఎంవీపీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి తమ పట్ల అనుచితంగా వ్యవహరించారంటూ ఓ వ్యక్తి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదుదారుడు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. వివరాలిలా ఉన్నాయి.

నవోదయ స్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ ముళ్లపూడి కోటేశ్వరరావు(80) మధురవాడలో ఉంటున్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం తంగ్యాం గ్రామంలో ఉన్న తమ భూమి అమ్మకానికి పెట్టారు. ఎచ్చెర్లకు చెందిన కోరాడ విమల, ఆమె భర్త నర్సింహమూర్తి భూమి కొనుగోలుకు వచ్చారు. అగ్రిమెంటు జరిగి ఏడాదిన్నర అయినా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో ఆ భూమిని కోటేశ్వరరావు మరొకరికి విక్రయించారు. అనంతరం నర్సింహమూర్తి దంపతులకు వారు చెల్లించిన మొత్తాన్ని ఇచ్చేశారు. అయితే నర్సింహమూర్తి దంపతులు ఇంకా సొమ్ము ఇవ్వాలంటూ వేధిస్తున్నారని కోటేశ్వరరావు ఆరోపిస్తున్నారు.

ఇటీవల వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఓ కార్యక్రమానికి హాజరు కాగా, అక్కడికి ఈ నర్సింహమూర్తి అతడి అనుచరులు వచ్చి, తనపై దాడి చేసి దుర్భాషలాడారన్నారు. దీనిపై బాధితుడు కోటేశ్వరరావు తొలుత ఆన్‌లైన్‌లో పోలీస్ కమిషనర్‌కు, అనంతరం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాను పోలీస్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు సీఐకి చెప్పగా, సీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని కోటేశ్వరరావు ఆరోపించారు. ఇది సివిల్ వ్యవహారమని, ఏం చేసుకుంటావో చేసుకో పొమ్మన్నారని పేర్కొన్నారు. తనపై దాడి జరిగిందని వెళితే ఇది సివిల్ వ్యవహారమంటూ చెప్పడం ఏమిటంటూ కోటేశ్వరరావు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై సీఐ మురళిని వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 2025 డైరీని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, సంఘ ప్రధాన కార్యదర్శి ఇ.పైడిరాజు, సంఘ నేతలు ఎంవీ. కృష్ణకుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.,

ఆపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా

అక్కయ్యపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీకి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అవ నాపు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు సుదర్శన్ పట్నాయక్, నగర ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి, రాష్ట్ర పర్యాటక కార్యదర్శి ఎంపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఏయూలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీ లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ విభా గాలకు చెందిన సిబ్బంది, అధికారులు ఏయూ ఉన్నతాధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఏయూ వీసీ జి.శశి భూషణరావుకు రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ అధికారులు, ఉద్యోగులు వీసీ, రిజిస్ట్రార్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఏయూలో సందడి కనిపించింది. ప్రతి విభాగంలోనూ ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ రీజనల్ స్పోర్ట్స్ మీట్

కంచరపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రిన్సిపాల్ డా. కె.నారాయణరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ మీట్‌లో భాగంగా ముందుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనుమతి లేకుండా హాస్టళ్ల నిర్వహణ

» ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాల ఇష్టారాజ్యం
» నగరంలో 43 వసతిగృహాలు, రెండింటికి మాత్రమే అనుమతులు
» కలెక్టర్ నియమించిన కమిటీ అధ్యయనంలో వెలుగు చూసిన వాస్తవాలు

మద్దిలపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 43 ప్రైవేటు జూనియర్ కళాశాలలు వసతి గృహాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో కేవలం రెండు కళాశాలలకే మాత్రమే ఇంటర్ బోర్డు అనుమతి ఉంది. మిగతా 41 జూనియర్ కళాశాలల వసతిగృహాలకు ఎలాంటి అనుమతులు లేవు. అయినా హాస్టళ్లను ఆయా కళాశాలల యాజమాన్యాలు దర్జాగా నిర్వహిస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక కమిటీ నియమించిన అధికారుల బృందం నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి.

ఇటీవల హైదరాబాద్‌లోని పలుచోట్ల ఇంటర్ వసతిగృహాల్లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిన విషయం విదితమే. దీంతో నగరంలో వసతిగృహాల పరిస్థితిని తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ అప్రమత్తమయ్యారు. హాస్టళ్ల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించి నివేదిక రూపొందించేందుకు ఒక ప్రత్యేక కమిటీని వేశారు. ఇందులో డీఈవో కార్యాలయం, పోలీసు, కలెక్టరేట్, అగ్నిమాపక, వైద్య శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున అధికారులు ఉన్నారు.

ఈ కమిటీ నగరంలో ఎన్ని వసతిగృహాలు ఉన్నాయి, వాటిలో సదుపాయాలు, ఆహార నాణ్యత, మౌలిక వసతులు, ఆహార నాణ్యత, విద్యార్థుల పట్ల నిర్వాహకులు ప్రవర్తించే తీరుపై ఆరా తీసి నివేదిక రూపొందించింది.

అయితే నగరంలో ఉన్న 43 హాస్టళ్లలో కేవలం రెండు హాస్టళ్లకే ఇంటర్ బోర్డు అనుమతి ఉన్నట్టు గుర్తించారు. మిగతా 41 వసతి గృహాలు బోర్డు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నాయని నివేదికలో పేర్కొన్నారు. అంతేకాకుండా మూడు వసతిగృహాల్లో సదుపాయాలు దారుణంగా ఉన్నాయని కలెక్టర్‌కు అందించిన నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. అయితే అనుమతి లేని వసతి గృహాల జాబితా జిల్లా కలెక్టర్ చేతిలో ఉండడంతో ఆయన ఎటువంటి చర్యలు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది నిరుద్యోగులకు మేలు

» ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులకు 2025 స్వర్ణయుగం కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ విప్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల మంది పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేశారని, ఎస్సీ వర్గీకరణతో జాప్యం జరిగిందన్నారు. ఈనెల చివర/ ఫిబ్రవరి తొలి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుందని, జూన్‌లోగా నియామకాలుంటాయన్నారు. కానిస్టేబుళ్ల నియామకంలో గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యంచేశారని ప్రస్తుతం నియామక చర్యలు వేగవంతమయ్యాయన్నారు. ఈ ఏడాది ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేస్తారని, ఇప్పటికే 20 నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. పాఠశాల విద్యలో నాణ్యత పెంచాలని మంత్రి నారా లోకేశ్ భావిస్తున్నారని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గిస్తామన్నారు. త్వరలో బదిలీలు, పదోన్నతులు చేపడతారన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

» బాణసంచా కాలుస్తుండగా బాంబు పేలి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం



శివ (ఫైల్‌ఫొటో)

కూర్మన్నపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. బాణసంచా కాలుస్తుండగా బాంబు పేలి ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు పరిధి వడ్లపూడి రజక వీధిలో సుద్దమల శివ (41),భార్యధనలక్ష్మి, కుమార్తె, కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. మంగళవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా తమ డాబాపై ఆనందంగా గడుపుతూ అర్ధరాత్రి 12 గంటల సమయంలో కేక్‌కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో గన్‌షాట్స్ కాల్చగా అవి పేలలేదు. దీంతో ఏమైందోనని దగ్గరకు వెళ్లి చూస్తున్న సమయంలో ఒక్కసారిగా అవి పేలి ఆయన కళ్లను బలంగా తాకాయి. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే శివ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో మునిగి యువకుడి మృతి



సాగర్‌నగర్, జనవరి1(ఆంధ్రజ్యోతి): స్నానానికి సముద్రంలో దిగిన ఓ యువకుడు కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ ప్రాంతానికి చెందిన యాస్ కనోజ్ (27) కుటుంబం విహారయాత్రకు విశాఖ వచ్చింది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం రుషికొండ ఐటీ సెజ్ ఎదురుగా ఉన్న సముద్ర తీరంలో వారంతా స్నానాలకు దిగారు. కనోజ్‌తో పాటు మహిళలు స్నానం చేస్తుండగా అలల ఉధృతికి కనోజ్ కొట్టుకుపోయాడు. అయితే కొద్దిసమయం తరువాత అదే ప్రాంతానికి కొట్టుకువచ్చాడు. చికిత్స అందించేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతిచెందాడు. వీరంతా స్నానాలకు దిగిన ప్రాంతంలో రిప్‌కరెంట్ ఎక్కువగా ఉంటుందని నిషేధించారు. ఇది తెలియక ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పీఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4న ఆదివాసీ మహోత్సవం



ఓం భువనేశ్వరీదేవి అమ్మవారు (ఫైల్‌ఫోటో)

డాబాగార్డెన్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆరిపాక పంచాయతీ యాటపాలెం గ్రామం మనీపురంలోని ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 4న భువనేశ్వరీ దేవి అమ్మవారికి తెల్ల జిల్లేడు పత్రితో ఆదివాసీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు భువనేశ్వరీ దేవి ఆరాధన పీఠం నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ మహోత్సవానికి హాజరయ్యే భక్తులు అమ్మవారికి మంగళస్నానం చేస్తారు. పంచామృతం, పాలు, కర్పూరాది సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించుకోవచ్చన్నారు. అమ్మవారికి స్వయంగా పూజలు చేసే అవకాశం కల్పించామన్నారు.

పోలమాంబ అమ్మవారి ఉత్సవానికి సన్నాహాలు



జగదాంబ కూడలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): లేపాక్షి జంక్షన్‌లోని పోలమాంబ అమ్మవారి 67వ వార్షిక మహోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధిలో కొలువు తీరి పురప్రజలను కాపు కాస్తున్న పురాతన తల్లిగా భక్తులు నమ్ముతారు. ఈ నెల 20 నుంచి 22 వరకు వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ పనులు చేపట్టింది. 10న రాట ముహూర్తంతో శ్రీకారం చుడతారు. 20న తొలేళ్ల సంబరం, 22న జాతర జరుపుతారు. 23న అన్న సమారాధన ఉంటుంది.

నీల్ ఆమండ్సన్ విగ్రహావిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న డా.వీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తదితరులు

కంచరపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కెమికల్ ఇంజినీరింగ్ పితామహుడిగా పేరొందిన నీల్ ఆమండ్సన్ విగ్రహాన్ని ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ఆవిష్కరించారు. కళాశాలలో సుదీర్ఘంగా సేవలందించి పదవీ విరమణ పొందిన డా.బీవీ లక్ష్మణరావు తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని సమకూర్చారు. ఈ కార్యక్రమానికి డా.వీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల అధ్యాపకులు, సేఫ్టీ కోర్సుల కో-ఆర్డినేటర్ ఎ.వరహాలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి దేవర చంద్రశేఖర్



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న నాయకులు

మహారాణిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహారాణిపేట మండల అధ్యక్షుడిగా దేవర చంద్రశేఖర్ నియమితులయ్యారు. వీఎస్‌బీ చక్రవర్తి, తలాడి గిరిజల ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి నాయకుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో మహారాణిపేట మండల అధ్యక్షునిగా చంద్రశేఖర్ రెండోసారి నియమితులయ్యారు. నాయకులు రూపాకుల రవికుమార్, చొక్కాకుల రాంబాబు, ఆల్బర్ట్, చితకల రాజబాబు, దశమంతుల సుశీల, జి రామతల్లి, దశమంతుల శ్రీనివాసరావు, రాజు, అప్పారావు, పలువురు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

దైవచింతన అవసరం: సీపీ బాగ్చి



మురళీనగర్ రామాలయంలో స్థానికులతో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తదితరులు

మురళీనగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మనం ఆధునిక యుగంలో నడుస్తూ, సాంకేతికతతో సహజీవనం చేస్తున్నా దైవ చింతన అవసరమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉద్ఘాటించారు. ఆ దైవం ఆశీస్సులు ఉంటేనే మన కుటుంబ సభ్యులు సహా యావత్తు ప్రజానీకం చల్లగా ఉంటారని అన్నారు. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ మంచి పనులు చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్లాలని హితవు పలికారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం మురళీనగర్ హైస్కూలు సమీపంలోని గౌరీ రామలింగేశ్వర ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎన్.రెడ్డి, కార్యదర్శి ఎస్.వరప్రసాద్ ఆహ్వానం మేరకు సిబ్బందితో కలసి ఆయన దర్శనానికి వచ్చారు. ఆలయ సముదాయంలోని శివాలయం, రామాలయం, సాయిబాబా సన్నిధిలో దైవారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సంప్రదాయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులతో కలసి కమిషనర్ నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి వి.శ్రీను, సభ్యులు, మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



పోస్టరును ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచరపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ మీట్‌లో భాగంగా ముందుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 16 ప్రైవేటు కళాశాలల నుంచి సుమారు 1,116 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

'పోర్టు ఆసుపత్రి టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటాం'

అక్కయ్యపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి నిర్మాణ పనుల టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుంటామని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు హెచ్చరించారు. పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొనసాగిస్తున్న నిరసన దీక్షలు బుధవారం 93వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలోనే ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకు కోశారు. పద్మనాభరాజు మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్య సేవలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమన్నారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, శంకరరావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

సీతమ్మధార, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానేసి గుడ్డ సంచులు వాడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. సీతమ్మధార ప్రాంతంలో పలుచోట్ల చిరు వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. సీతమ్మధార ప్రాంతంలో హాకర్స్ జోన్, రైతు బజార్ సమీపంలో చిరు వ్యాపారులకు జీవీఎంసీ అధికారులు బుధవారం నోటీసులు అందజేశారు.

జాతీయ ఆరోగ్య ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సీతంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య కార్యక్రమం ఉద్యోగుల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జాతీయ ఆరోగ్య కార్యక్రమం గౌరవ అధ్యక్షుడు శశిభూషణ్, అధ్యక్షుడు ఆర్.సురేష్, ఉపాధ్యక్షులు మోహన్, వీరబ్రహ్మం, గోపీనాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకల వేళల్లో మార్పులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రైళ్ల నూతన కాలపట్టిక (టైంటేబుల్) అమల్లోకి రావడంతో పలు రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

విశాఖ నుంచి బయలుదేరే రైళ్లలో విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708) మధ్యాహ్నం 2.30 గంటలకు, విశాఖ-దుర్గ్ ఎక్స్‌ప్రెస్ (18530) సాయంత్రం 4.50, విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22854) మధ్యాహ్నం 3.35, విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్ (22874) మధ్యాహ్నం 3.35, విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803) సాయంత్రం 5.30, విశాఖ-కోర్బా ఎక్స్‌ప్రెస్ (18518) రాత్రి 9.10 గంటలకు, విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18311) వేకువన 4.15, విశాఖ-రాయపూర్ పాసింజర్ (58528) వేకువన 4.20 గంటలకు, విశాఖ-కాకినాడ పాసింజర్ (17268) సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతాయి.

విశాఖ చేరే రైళ్లలో.. లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22848) ఉదయం 5.20 గంటలకు, సికింద్రాబాద్-విశాఖ వారాంతపు ఎక్స్‌ప్రెస్ (12784) ఉదయం 9.45, భగత్ కి కోఠి-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18574) ఉదయం 10.05, సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707) మధ్యాహ్నం 1.45కు, దుర్గ్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20829) మధ్యాహ్నం 1.50 , భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22819) మధ్యాహ్నం 3.50, కోరాపుట్-విశాఖ డైలీ పాసింజర్ (58537) సాయంత్రం 5.15, పలాస-విశాఖ పాసింజర్(67293) సాయంత్రం 6.00, రాజమండ్రి-విశాఖ పాసింజర్ (67295) సాయంత్రం 4.50, అమృతసర్-విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రాత్రి 9.50, సాయినగర్ షిర్డీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18504) రాత్రి 9.50, సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) రాత్రి 11.35 గంటలకు చేరుతాయి. కిరండోల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18513) సాయంత్రం 4.30 గంటలకు కిరండోల్‌లో బయలుదేరి వేకువన 3.40 గంటలకు విశాఖ చేరుతుంది. కోరాపుట్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18511) ప్రతి మంగళ, శనివారాల్లో ఉదయం 7.30 గంటలకు కోరాపుట్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.45 గంటలకు విశాఖ చేరుతుంది.

నాగమయ్యపాలెం తీరంలో పడవ బోల్తా



ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారులు, లంగరు వేసిన పడవ

భీమునిపట్నం (రూరల్), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన మర పడవ భీమిలి తీరం దాటిన తర్వాత నాగమయ్యపాలెం సమీపంలో మోటారు పని చేయక బోల్తా పడింది. పడవలో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. బాధితుల్లో ఒకరైన నూకరాజు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ ఫిషింగ్ జెట్టీ నుంచి మైలపల్లి చిన్నారావు, చింతపల్లి నూకరాజు, చింతపల్లి ముత్తురాజు, తెడ్డు ఎల్లాజీ, కాసరపు నూకరాజు, పూడిమడక వాసి తాతాజీ, జాలారిపేటకు చెందిన గురునాథ్‌లు చేపల వేటకు బుధవారం ఉదయం బయలుదేరారు. నాగమయ్యపాలెం సమీపంలోకి రాగానే పడవ మొరాయించింది. మత్స్యకారులు ఎంత ప్రయత్నించినా.. మోటారు పని చేయకపోవడంతో అతి కష్టం మీద తీరానికి చేర్చారు. తాతాజీకి ఫిట్స్, గురునాథ్ కాలికి గాయం కావడంతో వారిని ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని మత్స్యకారులు తెలిపారు.

ఆపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

అక్కయ్యపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీకి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఎంవీపీ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని అంశాలు, దేశం కోసం పోరాడిన వారి చిరస్మరణీయ చిత్రపటాలతో అందంగా రూపొందించడం సంతోషదాయకమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు సుదర్శన్ పట్నాయక్, నగర ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి, రాష్ట్ర పర్యాటక కార్యదర్శి ఎంపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీకి ప్రత్యేక కోర్టుల సదుపాయం కల్పించండి



ఎమ్మెల్యే వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కబడ్డీ సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను జిల్లా, రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కబడ్డీ క్రీడాభివృద్ధికి తమ వంతు సేవలందించాలని కోరారు. విశాఖలో కబడ్డీ క్రీడకు సంబంధించి ప్రత్యేకంగా కోర్టులు అందుబాటులోకి తీసుకురావాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు ఉరుకూటి శ్రీనివాసరావు, పి.అప్పారావు దాసు, మళ్ల గణపతి, టి.రమణ, టి.కోటేశ్వరరావు, ఇ.శివ పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఎర్నిమాంబ అమ్మవారు

జ్ఞానాపురం/జగదాంబ కూడలి జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రజలు ఆలయాలకు పోటెత్తారు. వన్‌టౌన్‌లోని మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి, కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారు, దుర్గాలమ్మగుడి, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. కుటుంబ సమేతంగా వచ్చి ఇష్టదైవాలకు పూజలు చేశారు. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో సందడిగా కనిపించింది. జ్ఞానాపురం ఎర్నిమాంబ, బల్లిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయాలను పెద్ద సంఖ్యలో సందర్శించారు. జ్ఞానాపురం పునీతపేతేరు దేవాలయంలో క్రైస్తవులు మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, మేయర్ జి.హరివెంకట కుమారిలను మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జోనల్ కమిషనర్‌కు స్థానిక అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్, వైసీపీ నగర అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



గండి బాబ్జీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు బాబ్జీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, నాయకులు వెల్లంకి భరత్, తెలుగు మహిళలు ఎక్కువగా హాజరయ్యారు.

212 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రాత్రి మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 212 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుచేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఎక్కువ కేసులు నమోదుచేశామన్నారు. డిసెంబరు 31 సందర్భంగా నగరంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 28 చోట్ల ప్రత్యేక బృందాలు బ్రీత్ అనలైజర్లతో తనిఖీ చేపట్టాయన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా ఈ ఏడాది ఒక్క ప్రమాదం కూడా జరగకుండా అడ్డుకోగలిగామన్నారు. అలాగే సైలెన్సర్లు మార్చి ఎక్కువ శబ్దం వచ్చేలా వాహనాలను నడుపుతున్న ముగ్గురిపై, బీచ్‌రోడ్డుతోపాటు నగరంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్టు సీపీ చెప్పారు. 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు మొదలైన తనిఖీలు బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయన్నారు.

ఇంటర్ విద్యార్థులను కొట్టిన లెక్చరర్ సస్పెన్షన్

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తగరపువలస బాసర జూనియర్ కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్ పి.మహేశ్‌ను యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఆ ఉత్తర్వులను బుధవారం పత్రికలకు విడుదల చేసింది. హోమ్ వర్క్ చేయలేదనే కారణంతో లెక్చరర్ మహేశ్ సుమారు 20 మందికి పైగా విద్యార్థులను మంగళవారం చావగొట్టారు. దీనిపై విద్యార్థులు కొందరు గాయాల ఫొటోలు తీసి మీడియాకు పంపించారు. విషయం తెలుసుకొని వారిని మరింతగా వేధించారు. విద్యార్థి సంఘం ఏఐడీఎస్ఓ దీనిపై ఆర్ఐఓకు ఫిర్యాదు చేయగా ఆయన వెళ్లి విద్యార్థులనే మందలించారు. యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడింది. ఎట్టకేలకు లెక్చరర్ మహేశ్‌ను సస్పెండ్ చేసినట్టు యాజమాన్యం తెలిపింది.

ఏళ్ల తరబడి తిష్ఠ

... 5వ పేజీ తరువాయి

మారింది. ఆర్డీ, డీడీ వంటి ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని కూడా ఇద్దరు ఉద్యోగులు కీలుబొమ్మలను చేసి ఆడిస్తుంటారనే ప్రచారం ఉంది. అందులో ఒకరు గడిచిన 15 ఏళ్ల నుంచి ఆర్డీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గానే పనిచేస్తు న్నారని, పదోన్నతుల్లో తన పేరు లేకుండా జాగ్రత్త పడుతుంటారు. వైద్య విధాన పరిషత్ నుంచి వచ్చిన ఒక ఉద్యోగి నుంచి భారీగానే వసూలు చేసినట్టు చెబుతున్నారు. అలాగే, ఒక ఫార్మసిస్టు తప్పుడు పనిచేసి ఒక కేసులో ఇరుక్కుపోగా..శాఖాపరమైన విచారణ లేకుండా చేసేందుకు గట్టిగానే డబ్బులు తీసుకున్నట్టు సమాచారం.

ముందుగానే బేరాలు: ఆర్డీ కార్యాలయం పరిధిలో ఆరు జిల్లాలు ఉన్నాయి. సుమారు 20 కేడర్లకు సంబంధించిన మూడు వేల మందికిపైగా ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, సీనియారిటీ జాబితాల తయారీ వ్యవహారాలన్నీ ఇక్కడ జరుగుతుంటాయి. ఈ కార్యాలయం కేంద్రంగా కొన్ని పోస్టులు భర్తీ చేస్తుంటారు. కార్యాలయ ఉద్యోగులపై వచ్చే ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేయడం ద్వారా కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

వివాదాల నిలయం.. కేంద్ర కారాగారం

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న కిషోర్‌తోపాటు అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును బదిలీ చేశారు. ఖైదీలకు సిబ్బంది ద్వారా గంజాయి చేరడంతోపాటు రాత్రి సమయంలో లోపల నుంచి సెల్‌ఫోన్ ద్వారా కాల్స్ బయటకు వెళుతున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. కేంద్ర కారాగారం లోకేషన్ నుంచి సెల్‌ఫోన్ కాల్‌డేటా రికార్డులు తీయగా రాత్రి సమయంలో ఖైదీలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఫోన్లు మాట్లాడుతున్నట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో కిషోర్, వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమితులైన మహేష్ బాబు జైలులో నిబంధనలు కఠినంగా అమలు చేయడం మొదలుపెట్టారు. జైళ్ల శాఖ మాన్యువల్‌లో పేర్కొన్నారంటూ అనుమానం ఉన్న జైలు సిబ్బందిని తనిఖీ చేయడం మొదలుపెట్టారు. సిబ్బంది లంచ్ బ్యాగ్‌లను లోపలకు అనుమతించడం మానేశారు. సెల్‌ఫోన్‌లను కూడా గేటు వద్దనే డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ఈ పరిణామం కొందరికి ఇబ్బందిగా మారింది. ఇద్దరు వార్డర్లు తరచూ గంజాయి తీసుకువెళుతున్నట్టు సూపరింటెండెంట్‌కు అనుమానం రావడంతో నాలుగు రోజుల కిందట వారిద్దరినీ ప్రైవసీ గదిలోకి తీసుకువెళ్లి తనిఖీ చేశారు. అయితే తోటి సిబ్బంది, ఖైదీలు ఎదురుగా తమను తనిఖీ చేయడం అవమానంగా భావించిన వార్డర్లు తమ ఆవేదనను తోటి వార్డర్ల వద్ద వెళ్లబోసుకున్నారు. దీంతో అంతా కలిసి జైలు ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగగా, ఇతర అధికారులు వచ్చి నచ్చజెప్పడంతో విరమించారు. కొద్దిసేపటికే సూపరింటెండెంట్ తమను కించపరిచేలా మాట్లాడారంటూ కుటుంబ సభ్యులతో సహా జైలు గేటు వద్ద మళ్లీ ఆందోళనకు దిగారు. జైళ్ల శాఖ డీఐజీ హరికిరణ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. తమ క్వార్టర్లలో పోలీసుల సహాయంతో తనిఖీలు చేయించారంటూ వార్డర్లు మరోసారి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో జైళ్ల శాఖ అధికారులతో కొందరు వార్డర్లు వాగ్వాదానికి దిగారు. ఈ విషయం డీఐజీ ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదించడంతో ఇక్కడ పనిచేస్తున్న 37 మంది వార్డర్లను ఇతర జైళ్లకు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ వివాదానికి ఇకనైనా ఫుల్‌స్టాప్ పడుతుందా...లేదా...అనేది చూడాలి.

ఐకానిక్ భవనం ఐటీకి రిజర్వు

... 5వ పేజీ తరువాయి

అద్దాలతో క్రూయిజ్ షిప్ మోడల్‌లో రూపుదిద్దుకున్న ఈ భవనంలో ఐదో అంతస్తు నుంచి ఎదురుగా సముద్రం కనిపిస్తుంది. వందలాది వాహనాలకు పార్కింగ్ సదుపాయం కలిగి, నగరంలో మధ్యలో ఉండడంతో దీనిని టీసీఎస్ కంటే పెద్ద ఐటీ సంస్థకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే దీనిని రిజర్వు చేసి పెట్టారు.

వేలం నుంచి మినహాయింపు

ఈ భవనంలో కమర్షియల్ షాపుల కోసం ఉద్దేశించిన గ్రౌండ్ ఫ్లోర్, మూడో అంతస్తు నుంచి ఏడో అంతస్తు వరకు ఐటీ కంపెనీలకు అద్దెకు ఇస్తామని వీఎంఆర్‌డీఏ ప్రకటించి దరఖాస్తులు ఆహ్వానించింది. అనేక ఐటీ సంస్థలు ముందుకు వచ్చాయి. అయితే అద్దె, నిర్వహణ వ్యయం, జీఎస్టీ కలుపుకొంటే రేట్లు కొంచెం అధికంగా ఉన్నాయని, కాసింత తగ్గించాలని వారు వీఎంఆర్‌డీఏ అధికారులను కోరారు. వారి అభ్యర్థనను పరిశీలించేలోపే ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. అనేక ఐటీ సంస్థలు విశాఖలో కార్యకలాపాల నిర్వహణకు ముందుకు వస్తున్నాయని, భవనాల అవసరం చాలా ఉందని, తొందరపడి చిన్న చిన్న సంస్థలకు ఐకానిక్ భవనాన్ని కేటాయించవద్దని సూచించారు. దాంతో రెండు రోజుల క్రితం (డిసెంబరు 30వ తేదీ) నిర్వహించిన వేలం నుంచి ఆ భవనాన్ని మినహాయించారు.

నెలాఖరుకు సిద్ధం

మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనాన్ని ఈ నెలాఖరుకు పూర్తిచేస్తాం. ముందు వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలని అనుకున్నాము. కానీ విశాఖ ఐటీ హబ్‌గా మారుతున్న తరుణంలో పెద్ద ఐటీ సంస్థకు భవనం మొత్తం ఇస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. పార్కింగ్ అందరికీ ఉపయోగపడుతుంది. పై అంతస్థులు మాత్రం ఐటీ సంస్థకే ఇస్తాం.

-ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

విమానాశ్రయం ప్రగతిపథం

... 5వ పేజీ తరువాయి

సిస్టమ్ ఏర్పాటుచేశారు. బయటకు వెళ్లేందుకు కొత్త గేటు ఒకటి తెరిచారు. నాలుగు ఇమిగ్రేషన్ కౌంటర్లు పెట్టారు. మరో రెండు ముందస్తు చెకింగ్ కౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి. దేశీయ ప్రయాణికుల కోసం అదనంగా 6 వేల చ.అ. లాంజ్ ఏర్పాటుచేశారు. ఎగ్జిక్యూటివ్ పాసింజర్ లాంజ్ కూడా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రి పెయిడ్ ట్యాక్సీలకు తోడుగా ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సర్వీస్‌లకు అవకాశం కల్పించారు. ప్రయాణికులు వారి గుర్తింపు కార్డు పరిశీలనకు ఎక్కువ సమయం క్యూలో నిల్చోకుండా డిజి-యాత్ర విధానం అమలులోకి తీసుకువచ్చారు. కేవలం ముఖ గుర్తింపుతోనే క్లియరెన్స్ లభిస్తోంది.

డిసెంబరులో 2.8 లక్షల మంది ప్రయాణం

2024 అక్టోబరులో 1,921 విమానాల ద్వారా 2,62,045 మంది ప్రయాణం చేయగా, నవంబరులో 1,845 విమానాల ద్వారా 2,49,937 మంది ప్రయాణించారు. డిసెంబరులో ప్రయాణికుల సంఖ్య 2,80,000 వరకు ఉంటుందని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు తెలిపారు. గత ఏడాది డిసెంబరులో ఈ సంఖ్య 2.19 లక్షలే ఉండగా ఈ డిసెంబరులో 60 వేల మంది పెరిగారన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసుపై వివాదం

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 62 ఏళ్ల పరిమితి ఉండడంతో వారికి కూడా అదే నిబంధన వర్తిస్తుందని, హఠాత్తుగా 60 ఏళ్లు దాటినందున ఉద్యోగ విరమణ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని కార్మిక సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కలిశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నిబంధన ప్రకారం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 ఏళ్లు మాత్రమేనని, తాను రెండేళ్లు పెంచి 60 ఏళ్ల వరకూ పనిచేసే అవకాశం కల్పించానని కమిషనర్ వివరణ ఇచ్చారు. అందుకు సంబంధించి ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వులను యూనియన్ నేతలకు చూపించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 62 ఏళ్ల పరిమితి వర్తింపజేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. తానేమీ చేయలేనని కమిషనర్ చెప్పడంతో, ఆందోళనకు దిగాలని నిర్ణయించామని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అరవై ఏళ్లు నిండినవారిని ఉద్యోగం నుంచి తొలగిస్తే కనీసం వారి వారసులకు అవకాశం కల్పించాలని కోరినా పట్టించుకోకుండా కొత్తవారిని నియమించేందుకు నోటిఫికేషన్ జారీచేయాలని చూస్తున్నారని నేతలు ఆరోపిస్తున్నారు.

కొత్త సంవత్సర వేడుకల్లో విషాదం

బాణసంచా కాలుస్తుండగా బాంబు పేలి కాంట్రాక్టు కార్మికుడు దుర్మరణం


మృతుడు శివ (ఫైల్)

కూర్మన్నపాలెం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. బాణసంచా కాలుస్తుండగా బాంబు పేలి ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు పరిధి వడ్లపూడి రజక వీధిలో సుద్దమల శివ (41), భార్య ధనలక్ష్మి, కుమార్తె, కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. మంగళవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా తమ డాబాపై ఆనందంగా గడుపుతూ అర్ధరాత్రి 12 గంటల సమయంలో కేక్ కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో గన్‌షాట్స్ కాల్చగా అవి పేలలేదు. దీంతో ఏమైందోనని దగ్గరకు వెళ్లి చూస్తున్న సమయంలో ఒక్కసారిగా అవి పేలి ఆయన కళ్లను బలంగా తాకాయి. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే శివ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో మునిగి యువకుడి మృతి


యాస్ కనోజ్ మృతదేహం

సాగర్‌నగర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): స్నానానికి సముద్రంలో దిగిన ఓ యువకుడు కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ ప్రాంతానికి చెందిన యాస్ కనోజ్ (27) కుటుంబం విహారయాత్రకు విశాఖ వచ్చింది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం రుషికొండ ఐటీ సెజ్ ఎదురుగా ఉన్న సముద్ర తీరంలో వారంతా స్నానాలకు దిగారు. కనోజ్‌తో పాటు మహిళలు స్నానం చేస్తుండగా అలల ఉధృతికి కనోజ్ కొట్టుకుపోయాడు. అయితే కొద్దిసమయం తరువాత అదే ప్రాంతానికి కొట్టుకువచ్చాడు. చికిత్స అందించేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతిచెందాడు. వీరంతా స్నానాలకు దిగిన ప్రాంతంలో రిప్‌కరెంట్ ఎక్కువగా ఉంటుందని నిషేధించారు. ఇది తెలియక ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పీఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 48, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 48 దొండకాయలు 52, బంగాళ దుంపలు 27, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36 దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 60, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


65వ వార్డు గరుడాద్రిపై చందన భరితుడైన వేంకటేశ్వరస్వామి


86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కాశీవిశ్వేశ్వరుడు


స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ రకాల పండ్లతో శ్రీవారిని అలంకరించిన దృశ్యం


కణితిలో పూజలందుకున్న శ్రీఉమా మార్కండేశ్వరస్వామి

ఆలయాలకు నూతన సంవత్సర శోభ

- వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరణ
- వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

కూర్మన్నపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ ఆలయాలు కొత్త కళను సంతరించుకున్నాయి. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో ఆలయ కమిటీల ప్రతినిధులు శోభాయమానంగా అలంకరించారు. బుధవారం వేకువజాము నుంచే ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. 88వ వార్డు గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి పంచామృతాభిషేకాలు, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం చందనరూపిడిగా శ్రీవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే 86వ వార్డు శాతవాహన నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాలయంలో, 87వ వార్డు వడ్లపూడిలో శ్రీసీతా రామలింగేశ్వరస్వామి దేవాలయంలోని బ్రహ్మసూత్ర శివలింగానికి, కణితిలో శ్రీఉమా మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిలు పూజలు జరిపారు. 87వ వార్డు రాజుల పాలెం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. అదేవిధంగా 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలోని కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి, ఎర్రగెడ్డ కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో సామికి పూజలు జరిపారు.

ఉక్కుటౌన్‌షిప్: ఉక్కునగరంలోని శివాలయం, వేంకటేశ్వరస్వామి, త్రిశక్తి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. కొత్త వత్సరమంతా అందరికీ మేలు జరగాలని కాంక్షిస్తూ అర్చకులు పూజలు జరిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ శ్రీవారి ఆలయంలో స్వామివారిని వివిధ రకాల ఫలాలతో సుందరంగా అలంకరించగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి చందన అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ చైర్మన్ దొడ్డి రమణ ఏర్పాట్లు చేశారు.

అగనంపూడి: ఇక్కడి బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పూజలు నిర్వహించారు. కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు. దుర్గమాంబ ఆలయంలో పాటు శివాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో పూజలు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణస్వామి పూజలు, అర్చనలు జరిపారు. కాగా దాత నక్కా రామ్మూర్తి ఆలయానికి నేమ్ బోర్డును తయారు చేయించి ధర్మకర్త ఈకే చారికి అందజేశారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంతో పాటు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయక దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగాయి. బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి పంచామృతాలతో అభిషేకించాక వేదపండితులు పువ్వులు, నగలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. శ్రీవారి అన్నదాన మూల నిధికి వెంకట రామాచార్యులు, సంతోష్‌కుమార్ దంపతులు రూ.50 వేలను విరాళంగా అందజేశారు.


ఎమ్మెల్యే గణబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు


పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో వేడుకలు


ఎమ్మెల్యే పంచకర్లకు జెడ్పీ హేమవతి శుభాకాంక్షలు

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు

గోపాలపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నేతలకు శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. గోపాలపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు నేతలు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

పెందుర్తి: పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీకి టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. గుర్రమ్మపాలేనికి చెందిన సుఖవాసి అజయ్ ఆధ్వర్యంలో తరలివచ్చిన నేతలు బాబ్జీని పూలమాలలతో సత్కరించారు. రెడ్డి నారాయణరావు, దూది రమణ, చీర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబును కూటమి నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సుజాతనగర్‌లోని దాట్ల మేన్షన్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేకు నోటు పుస్తకాలు, పెన్నులు, మొక్కలు అందించారు. జోనల్ కమిషనర్ హేమవతి మొక్కను అందజేశారు, సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బంది నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, జనసేన నేతలు ఐతి సింహాచలం నాయుడు, ఎం. రాజాసుధాకర్, కె.కనకారావు. ఎస్.సోమశేఖర్, జి. అప్పారావు, నాయుడు, నారాయణరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నేతలు రూపొందించిన క్యాలెండర్‌ను పంచకర్ల ఆవిష్కరించారు.

సోనోవిజన్ లక్కీ డ్రా విజేతలు వీరే...



విజేతలను ప్రకటిస్తున్న సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి, కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ డైమండ్ పార్క్ సమీపంలోని ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ షోరూం సోనోవిజన్‌లో బుధవారం సాయంత్రం లక్కీడ్రా తీశారు. రాత్రి 7 గంటలకు జరిగిన కార్యక్రమంలో హోండా అమేజ్ కారు, రెండు 55 ఇంచెస్ ఎల్‌ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ బహుమతులుగా అందించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. వందలాది మంది కొనుగోలు దారుల సమక్షంలో లక్కీడ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. డ్రాలో హోండా అమేజ్ కారును (కూపన్ నంబరు 015641) గాజువాకకు చెందిన సీహెచ్‌వీ రమణ దక్కించుకున్నారు. 55 ఇన్చెస్ ఎల్‌ఈడీ టీవీలను (కూపన్ నెం.26709) మద్దిలపాలేనికి చెందిన ఎం.గుణసుందరి, (కూపన్‌నెం.40939) తాటిచెట్లపాలేనికి చెందిన సతీష్ కుమార్ గెలుచుకున్నారు. సీతమ్మపేటకు చెందిన సీహెచ్ రమేశ్‌కుమార్ (కూపన్ నెం.91463) రిఫ్రిజిరేటర్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌ను సోనోవిజన్ అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ చైన్‌స్టోర్ సోనోవిజన్‌లో అని, తమ వద్ద అన్ని పెద్ద కంపెనీల ఎల్‌ఈడీ టీవీలు,మొబైల్స్, ల్యాప్‌టాప్స్, రిఫ్రిజిరేటర్స్, వాషింగ్ మెషీన్స్, ఏసీలు, కిచెన్ అప్లయెన్సెస్ ఎప్పుడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభిస్తున్నాయన్నారు. 22.5 శాతం వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్ ఈ సారి ప్రత్యేకతని, ఒక ఈఎంఐ రిఫండ్ ఇంకా అనేక ఆఫర్స్ అందిస్తున్నామన్నారు.

ఈ ఏడాదిలో నిరుద్యోగులకు మేలు

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు


మాట్లాడుతున్న చిరంజీవిరావు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులకు 2025 స్వర్ణయుగం కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ విప్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల మంది పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేశారని, ఎస్సీ వర్గీకరణతో జాప్యం జరిగిందన్నారు. ఈనెల చివర/ ఫిబ్రవరి తొలి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుందని, జూన్‌లోగా నియామకాలుంటాయన్నారు. కానిస్టేబుళ్ల నియామకంలో గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యంచేశారని ప్రస్తుతం నియామక చర్యలు వేగవంతమయ్యాయన్నారు. ఈ ఏడాది ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేస్తారని, ఇప్పటికే 20 నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. పాఠశాల విద్యలో నాణ్యత పెంచాలని మంత్రి నారా లోకేశ్ భావిస్తున్నారని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గిస్తామన్నారు. త్వరలో బదిలీలు, పదోన్నతులు చేపడతారన్నారు.

నోరూరించిన ఫుడ్ స్టాల్స్


ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసిన విద్యార్థులు

కూర్మన్నపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అన్నట్టుగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్ అందరికీ నోరూరించాయి. ఇక్కడి శ్రీరామకృష్ణా స్కూల్‌లో డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ లలితకుమారి బుధవారం ఈ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు 86 స్టాల్స్‌లో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శిస్తామన్నారు. ఆహార ధాన్యాలను పండించడానికి రైతులు ఎంతో శ్రమిస్తారని, అటువంటి ఆహార పదార్థాలను దుర్వినియోగం చేయవద్దని పలువురు విద్యార్థులు సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో నాగుల రవికుమార్, భాస్కరరావు, గిరీశ్ శ్రీను, బి.రమణమ్మ, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

గాజువాక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధి సుందరయ్య కాలనీలో గల 10ఎంజీడీ తాగునీటి శుద్ధి కర్మాగారంలో నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం పలు వార్డులకు నీటి సరఫరా జరగదని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా 70, 71, 72, 73, 74, 76, 64, 65 వార్డుల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

స్టీల్‌ప్లాంట్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్


ధర్నాలో పాల్గొన్న నాయకులు

ఉక్కుటౌన్ షిప్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్లాంట్ ప్రధాన గేటు ముందు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. యాజమాన్యం వద్ద నగదు ఉన్నప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, పీవీ రమణమూర్తి, బీఎన్ రాజు, సుబ్బయ్య, కారు రమణ, అవతారం, అప్పలరాజు, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావానికి తరలిరావాలి'

గాజువాక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల ఐదున జరగనున్న హైందవ శంఖారావ సభకు ప్రజలంతా అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం సభకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు లక్షల మందితో ఈ సభను నిర్వహించనున్నామని, హిందువులంతా కుటుంబ సమేతంగా హాజరు కావాలన్నారు. ఆర్‌ఎస్ఎస్ నాయకుడు జనార్దన్ మాట్లాడుతూ హిందువుల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రజలంతా ఈ సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, వాసు, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, రంగనాయకులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కరణంరెడ్డి నరసింగరావు, నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కాలనీల్లో యువత ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాస్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, వేగుంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా స్టీల్‌ప్లాంట్ ఇంటక్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉక్కు ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

తలశిల బలరామకృష్ణ జన్మదిన వేడుకలు


తలశిల బలరామకృష్ణ దంపతులను సత్కరించిన టీఎస్సార్ టీబీకే సిబ్బంది

శ్రీనగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ టీబీకే కళాశాల, యాపిల్ ఐ స్కూల్ చైర్మన్ తలశిల బలరామకృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేకు కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బలరామకృష్ణ దంపతులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు విష్ణువర్ధన్, ప్రమీలా ముఖర్జీతో పాటు సుభాషిణి, విజయ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో షిప్‌యార్డు అభివృద్ధి: సీఎండీ

మల్కాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను వినియోగించి హిందుస్థాన్ షిప్‌యార్డు అభివృద్ధికి బాటలు వేస్తామని సీఎంపీడీ హేమంత్ ఖత్రీ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన మంగళవారం కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ రోబోటిక్స్ రంగాలతో కీలక సంస్కరణలు ప్రారంభిస్తామన్నారు. అధికారులు మూడో తేదీన మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్‌పై సమావేశమవుతారని, విజన్ 2047 ఎంబీవీ 20230తో సమలేఖనమైన వ్యూహాత్మక విజన్ 2025- 2034 విడుదల చేస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూనియన్ నేత శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం: 'పల్లా'

గాజువాక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు కూటమి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ నాయకుడు మొల్లి రాధా ప్రకాశ్ ఆర్థిక సహాయంతో పెంటి రాజు స్పోర్ట్స్ చారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరగనున్న క్రికెట్ పోటీల క్రీడాకారులకు బుధవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడాకారులకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మొల్లి పెంటిరాజు, రమణ, అప్పలనాయుడు, ప్రదీప్, అనిల్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.